క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ తెలిపారు. గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, పనుల పురోగతిపై సమావేశంలో సమీక్షిస్తామని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు తమ శాఖల నివేదికలతో హాజరుకావాలని సూచించారు. వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మొక్కలు పంపిణీ



బోగోలు అంగన్‌వాడీ కేంద్రంలో పండ్ల మొక్కలు నాటుతున్న సీడీపీఓ

అర్ధవీడు: పోషణ్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నాగులవరం, అర్ధవీడు సెక్టారులోని అంగనువాడీ కేంద్రాలకు బుధవారం మొక్కలు పంపిణీ చేసినట్లు సీడీపీఓ కె.కుమారి తెలిపారు. సీడీపీఓ మాట్లాడుతూ.. ఒక్కో కేంద్రానికి 5 చొప్పున మొత్తం 95 పండ్ల మొక్కలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు పోషకాహార ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మోహిద్దీన్‌పురం-2, చిన్న కందుకూరు, దొనకొండలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు.

అనుమతి లేకుండా డీజే వాడితే చర్యలు

మార్కాపురం/కొమరోలు: మార్కాపురం పట్టణ, రూరల్ పరిధిలో, అలాగే కొమరోలు మండలంలో అనుమతి లేకుండా డీజే సౌండ్ బాక్సులు వాడితే కేసులు నమోదు చేస్తామని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య బుధవారం వేర్వేరు ప్రకటనల్లో హెచ్చరించారు. వివిధరకాల ఫంక్షన్లు, తిరునాళ్లకు నిర్వాహకులు తమ ఇష్టం వచ్చినట్లుగా డీజే బాక్సులు పెట్టి విపరీతమైన శబ్ద కాలుష్యం చేస్తున్నారని, దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు, గుండె జబ్బుల బాధితులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా అనుమతి లేని డీజేలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే ఉపయోగించాలంటే పోలీసు శాఖ అనుమతి తీసుకుని, షరతులకు లోబడి సౌండ్ పెట్టాలని స్పష్టం చేశారు. మైకులు పెట్టుకోవాలన్నా కూడా పోలీసు అనుమతి తీసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు స్పీకర్లు అందజేత



స్పీకర్లను బహూకరిస్తున్న సర్పంచ్

కంభం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని మండల విద్యాశాఖాధికారులు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని లింగాపురం ప్రాథమిక పాఠశాలకు గ్రామ సర్పంచ్ నరాల నాగార్జునరెడ్డి బుధవారం రూ.12,500 విలువ చేసే స్పీకర్లను అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఎంఈఓలు అభినందించారు. ఉపాధ్యాయులు ఖాసింపీరా, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి తీవ్ర గాయాలు

- ట్రైన్ ఎక్కే సమయంలో జారిపడిన సలీమ్
- రాచర్ల మండలం సోమిదేవిపల్లె రైల్వేస్టేషన్‌లో ప్రమాదం



తీవ్రంగా గాయపడిన సలీమ్

బేస్తవారిపేట: రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడటంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన రాచర్ల మండలంలోని సోమిదేవిపల్లె రైల్వేస్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అనుమలవీడు గ్రామానికి చెందిన షేక్.సలీమ్ అనే యువకుడు రాత్రి 9:30 గంటలకు సోమిదేవిపల్లె రైల్వేస్టేషన్‌లో హైదరాబాద్ వెళ్లే కాచిగూడ ట్రైన్ ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. యువకుడికి నడుము భాగం, కాళ్ల వద్ద తీవ్రంగా గాయాలయ్యాయి. రైల్వే స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించినట్లు సమాచారం.



అనుమలవీడులోని నక్కల వాగులో చెక్‌డ్యామ్ తెగడంతో చుక్కనీరు లేని దృశ్యం



జేపీ చెరువులోని లోతువాగుపై నాసిరకంగా నిర్మించిన చెక్‌డ్యామ్

నీళ్లు చెక్కేస్తున్నాయ్..!

- మరమ్మతులకు నోచుకోని చెక్ డ్యాంలు
- నాసిరకం పనులతో ఎక్కడికక్కడ తెగిన వైనం
- వృథాగా దిగువకు వెళ్తున్న వర్షం నీరు
- భూగర్భ జలాలు అడుగంటి రీచార్జ్ కాని డీప్‌బోర్లు
- చెక్‌డ్యామ్‌లను బాగుచేయాలని రైతుల విజ్ఞప్తి



నక్కలవాగులో బీడుభూమిలా చెక్‌డ్యామ్ ఎగువ భాగం

రాచర్ల:

భూగర్భ జలాలను పెంపొందించేందుకు నిర్మించిన చెక్‌డ్యామ్‌లు ఎందుకూ కొరగాకుండా పోయాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యామ్‌లు నాణ్యతా లోపం కారణంగా ఎక్కడికక్కడ తెగిపోవడంతో వర్షం నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఫలితంగా భూగర్భ జలాలు పెరగక వ్యవసాయ బోర్లు రీచార్జ్ కావడం లేదని రైతులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కరువు ప్రాంతమైన రాచర్ల మండల పరిధిలో భూగర్భ జలాల పెంపునకు లక్షలాది రూపాయలు వెచ్చించి వాగులపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు కొద్దిపాటి వర్షాలకే తెగిపోయాయి. దీంతో వాగుల్లో చుక్కనీరు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. జేపీ చెరువు గ్రామంలోని లోతువాగు, అనుమలవీడులోని నక్కలవాగు, గౌతవరంలోని పీతురువాగు, సోమిదేవిపల్లెలోని పగిడివాగు, పాలకవీడులో కొండ ప్రాంతంలో, గుడిమెట్ట పరిధిలోని ఎర్ర వాగుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. ఒక్కో చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపట్టడంతో కొద్దిపాటి వర్షాలకే చెక్‌డ్యామ్‌లు తెగిపోయాయి. కాలక్రమంలో మరికొన్ని చెక్‌డ్యామ్‌ల మట్టికట్టలు తెగిపోయాయి. వర్షాలు కురిసినప్పటికీ వరద నీరంతా వృథాగా దిగువకు ప్రవహిస్తుండటంతో బోరుబావుల్లో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు స్పందించి తెగిపోయిన చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేయించి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

సూపర్ జీఎస్టీతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం



కంభంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు



మార్కాపురం : జీఎస్టీ 2.0పై అవగాహన కల్పిస్తున్న సుమన్ తదితరులు

మార్కాపురం టౌన్: జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ కె.సుమన్ పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో జీఎస్టీ 2.0పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీలో అనేక మార్పులు తీసుకొచ్చాయని, వాటిపై అందరూ అవగాహన పెంచుకుని సేవింగ్స్ చేసుకోవాలన్నారు. జీఎస్టీ తగ్గింపు ఎక్కడైనా అమలుకాకపోతే అధికారుల దృష్టికి తీసుకునిరావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కంభం: జీఎస్టీ 2.0 తో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ జి. తిరుమలయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వస్తు సేవల పన్నుల విధానంలో తీసుకొచ్చిన మార్పుల వల్ల స్వదేశీ వస్తు ఉత్పత్తి పెరుగుతుందని, పన్నుల భారం తగ్గడంతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. పన్నుల విధానంలో తీసుకొచ్చిన సంస్కరణలు, ప్రయోజనాలను సంధ్య, దేవమణి, శ్రీనివాసరెడ్డి వివరించారు.

ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయాలి

- డీపీఓ వెంకటేశ్వరరావు



ఉప్పలపాడులో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

పొదిలి రూరల్: స్వర్ణ పంచాయతీ హౌస్ ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌కు సంబంధించిన పాత బకాయిలు ఈ నెల చివరిలోగా వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు గ్రామాన్ని ఆయన సందర్శించి శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పన్ను బకాయిలు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి దోహదపడాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో రక్షిత నీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఈఓఆర్డీ జి.శోభన్‌బాబు, సర్పంచ్ గుంటూరి ఏసోబు, పంచాయతీ కార్యదర్శి శేషగిరి, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



ఏపీఓకు వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు

తర్లుపాడు: ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించి వేధింపులు ఆపాలని వీఓఏ(సీఐటీయూ అనుబంధం) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం తర్లుపాడు ఏపీఓ రమేష్‌బాబుకు వీఓఏలు వినతిపత్రం అందించారు. గత కొంతకాలంగా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. ఫైవ్ జీ మొబైళ్లు అందించే వరకు ఆన్‌లైన్ వర్కులు చేయలేమని తేల్చిచెప్పారు. పెండింగ్ వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దుచేసి, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి ఇంటెన్సివ్‌లు చెల్లించి, రాజకీయ వేధింపులను నియంత్రించాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వీఓఏలు కరిష్మా, పార్వతమ్మ, పిరాభి, మల్లేశ్వరి, ఎస్తేరమ్మ, చంద్రకళ, శ్రీదేవి, నాగూర్, బి.నాగమల్లేశ్వరి, శారద పాల్గొన్నారు.

వాగు పొంగితే పితలాటకం!



వాగు నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

పొదిలి: పొదిలి-దర్శి రోడ్డులోని పితూరు వాగు చిన్నపాటి వర్షానికే పొంగుతుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రహదారి గుంతలమయం కావడం, పైగా నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఎక్కడ పడిపోతామోనని ఆందోళన చెందుతున్నారు. సైలెన్సర్లలోకి నీరు చేరి వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని, అధికారులు స్పందించి పైపు కల్వర్టు అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చెకుముకి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

మార్కాపురం టౌన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన పాఠశాలల్లో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో అందరూ పాల్గొనాలని జేవీవీ జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి.శరత్ కోరారు. బుధవారం పట్టణంలోని ఐక్యూ కోచింగ్ సెంటరులో చెకుముకి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ జిల్లా నాయకులు వీరారెడ్డి, జేవీవీ నాయకులు వెంకటరావు, రవికుమార్, శంకర్ రెడ్డి, ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.లక్ష విలువైన బాణసంచా స్వాధీనం



బాణసంచా సీజ్ చేస్తున్న పోలీసులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని వడ్డె బజారులో అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచిన ఇంటిపై పట్టణ ఎస్సై సైదుబాబు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. సుమారు లక్ష రూపాయల విలువ చేసే బాణసంచాను సీజ్ చేయడంతోపాటు యజమాని కోటపాటి ప్రశాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసులో జైలు శిక్ష



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న సీఐ సురేష్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్, రాచర్లగేటు సెంటర్‌లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ కె.సురేష్ తెలిపారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరచగా జడ్జి భరత్‌చంద్ర వారిలో ఇద్దరికి 20 రోజుల జైలు శిక్ష, ఒకరికి 5 రోజులు, మరొకరికి ఒక రోజు జైలు శిక్షతో పాటుగా రూ.10 వేల జరిమానా విధించారని వివరించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

పొదిలి: మద్యం మత్తులో వేగంగా కారు నడపడంతో నంద్యాల-ఒంగోలు రోడ్డులోని ఓ హోటల్‌లోకి కారు దూసుకెళ్లింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. కనిగిరికి చెందిన ఓ వ్యక్తి కారును వేగంగా డ్రైవ్ చేస్తుండటంతో, అదుపు తప్పి పెద్ద మసీదు వద్ద ఉన్న ఓ హోటల్‌లోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. హోటల్‌లోని సామాన్లు దెబ్బతిన్నాయి. స్థానికులు గమనించి డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వేమన తెలిపారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత



అర్ధవీడు : వెలగలపాయలో వన్యప్రాణులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



గిద్దలూరు : వన్యప్రాణుల ప్రాధాన్యతను వివరిస్తున్న అధికారులు

అర్ధవీడు: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎస్సై శివ నాంచారయ్య, అటవీశాఖ అధికారి అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా వెలగలపాయ, గన్నెపల్లి గ్రామాల్లో బుధవారం అటవీ శాఖ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తురిమెళ్ల సెక్షన్ బీట్ అధికారులు అబ్దుల్ గఫార్, రాజేష్ ప్రసంగిస్తూ.. అడవి పందుల వల్ల పంట నష్టం సంభవిస్తే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వన్యప్రాణి సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని గుండ్లకమ్మ రేంజ్ ఆఫీసర్ నరసింహారావు పేర్కొన్నారు. దిగువమెట్ట గ్రామంలోని వన విహారి క్షేత్రంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన్య ప్రాణులను సంరక్షించడం వల్ల జీవవైవిధ్యం పరిడవిల్లి, మానవ మనుగడ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వంశీకృష్ణ, బీట్ ఆఫీసర్లు చేజర్లయ్య, రామకృష్ణ, కోటేశ్వరరావు, నాగశేఖర్, విద్యార్థు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి యత్నం హేయం



నినాదాలు చేస్తున్న ఆయా సంఘాల నాయకులు

పొదిలి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై బూటు విసిరేందుకు న్యాయవాది యత్నించడాన్ని నిరసిస్తూ స్థానిక ఏబీఎం స్కూల్ వద్ద ప్రజా, దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రాం విగ్రహాల వద్ద నివాళులర్పించారు. దాడికి యత్నించిన లాయర్ రాకేష్‌పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. సీపీఐ మండల కార్యదర్శి కేవీ రత్నం, దళిత మహాసభ జిల్లా కార్యదర్శి ధర్నాసి పెద్దన్న, ఎంఆర్‌పీఎస్ నాయకులు వేల్పుల సురేష్, ఆదిమూలపు రవి, పందిటి ఏసేబు, పత్రా ఆనందరావు, గుడిపాటి ప్రసాద్, మల్లెల శ్యామ్, లాజర్, ఆరోన్, ఎలీషా, నాగులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎయిర్‌ఫోర్స్ డే



ఐఏఎఫ్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

తర్లుపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో 93వ ఎయిర్ ఫోర్స్ డేని హెచ్ఎం సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత అత్యాధునిక ఆయుధాల గురించి విద్యార్థులకు వివరించారు. గొప్ప సాంకేతికతతో ప్రపంచ దేశాల సరసన భారత ఎయిర్ ఫోర్స్ నిలిచిందని హెచ్ఎం పేర్కొన్నారు. విద్యార్థులు ఐఏఎఫ్ ఆకృతిలో కూర్చుని భారత్ మాతాకీ జై, జయహో ఐఏఎఫ్ అంటూ నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మార్కాపురంలో పోలీసుల తనిఖీలు



మార్కాపురం రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, కంభం సెంటర్, దోర్నాల సెంటర్, పూలసుబ్బయ్య కాలనీ, ఎస్టేట్, ఏకలవ్య కాలనీ తదితర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు సోదాలు చేపట్టడంతో ప్రజలు కాస్త అయోమయానికి గురయ్యారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రజలు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలను కట్టడి చేసేందుకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్లకు ఆర్డినేషన్ అందజేత



కార్యక్రమానికి హాజరైన బిషప్‌లు, రెవరెండ్లు, పాస్టర్లు

మార్కాపురం: క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఏపీబీసీ(ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్) జిల్లా అధ్యక్షుడు జడి లాజరస్ పేర్కొన్నారు. బుధవారం మార్కాపురం టౌన్‌లోని సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల బిషప్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది పాస్టర్లకు ఆర్డినేషన్(హోదా) కల్పించారు. 70 మందికి వివిధ హోదాలు ప్రకటించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బిషప్ నెహేమియా శ్రీనివాసరావు, స్టేట్ ప్రెసిడెంట్ బిషప్ వై.బాలరాజు, విశాఖ పట్నం బిషప్ ఇమానియేల్, నంద్యాల ఆర్సీ బిషప్ అమ్రూస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురిని ఘనంగా సన్మానించారు.